

చీనీ టన్ను రూ.20 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి. మార్కెట్‌కు 17 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.8.50
కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.8.50 పలికింది. కనిష్టం రూ.3, సరాసరిన రూ.6 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.3°/21.8°
జిల్లాలో మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్‌గా శివరామిరెడ్డి



ఉరవకొండ: ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి 2023–24 సంవత్సరానికి గాను శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. తనను చైర్మన్‌గా నియమించినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, శాసన మండలి చైర్మన్ మోసేనురాజుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సభ్యుల గౌరవాధికారాలకు ఎవరు భంగం కలిగించినా, ప్రొటోకాల్ విషయంలో ఎటువంటి నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించినా విచారణ జరిపి చర్యలు తీసుకునేలా ప్రివిలేజ్ కమిటీ పని చేస్తుందన్నారు. చైర్మన్‌గా నియమితులైన వై.శివరామిరెడ్డికి ఉరవకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు బుక్కపట్నంలో 'జగనన్నకు చెబుదాం'

పుట్టపర్తి: జిల్లా కేంద్రానికి రాలేని వారి కోసం మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్న 'జగనన్నకు చెబుదాం' మండల స్థాయి స్పందన కార్యక్రమం బుధవారం బుక్కపట్నంలో నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు బుక్కపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందున్న షాదీఖానాలో నిర్వహించే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారని తహసీల్దార్ కరుణాకర్, ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యపై అర్జీలు ఇచ్చుకోవాలని సూచించారు.

నెట్టికంటుడి హుండీ ఆదాయం రూ.64.27 లక్షలు



హుండీ నగదు లెక్కిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీ కానుకల ద్వారా రూ.64.27 లక్షల ఆదాయం లభించినట్లు ఈవో వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. భక్తులు స్వామివారికి హుండీ ద్వారా సమర్పించిన కానుకల లెక్కింపు మంగళవారం చేపట్టారు. 43 రోజులకు గానూ హుండీల ద్వారా రూ.64,27,361 నగదుతో పాటు అన్నదాన హుండీ ద్వారా రూ.21,844 అందిందన్నారు. అలాగే 0.01 మి.గ్రా. బంగారు, 2.58 కిలోల వెండిని కానుకల రూపంలో భక్తులు స్వామివారికి సమర్పించినట్లు తెలిపారు. ఆలయ అధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఆర్డీసీ సేవాసమితి సభ్యులు, బళ్లారికి చెందిన వీరభద్రసేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

టైలరింగ్, జర్దోసి మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ

అనంతపురం: ఉమెన్స్ టైలరింగ్, జర్దోసి మగ్గం వర్క్‌పై ఎస్కేయూనివర్సిటీ సమీపంలోని రూడ్‌సెట్‌లో మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు రూడ్‌సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అక్టోబర్ 11వ తేదీ నుంచి నెల రోజుల పాటు కొనసాగే శిక్షణకు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన గ్రామీణ నిరుద్యోగ మహిళలు అర్హులు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తారు. పూర్తి వివరాలకు 83099 15577, 96188 76060లో సంప్రదించవచ్చు.

21 మండలాల్లో వాన



పుట్టపర్తి అర్బన్: జిల్లా వ్యాప్తంగా నాలుగు రోజులుగా అక్కడక్కడా మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు 21 మండలాల్లో వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా పుట్టపర్తి మండలంలో 41.8 మిమీ వర్షపాతం నమోదైంది. ఇక కొత్తచెరువు 24.8, తాడిమర్రి 19.2, ముదిగుబ్బ 15.4, కదిరి 13.2, సీకేపల్లి 12.6, తలుపుల 10.4, నల్లమాడ 8.6, అగళి 8.6, ఓడీచెరువు 8.4, చిలమత్తూరు 8.2, రొళ్ల 7.4, బుక్కపట్నం 7.2, రామగిరి 5.4, బత్తలపల్లి 5.2, తనకల్లు 4.6, కనగానపల్లి 4.2, నల్లచెరువు 3.2, హిందూపురం 3.2, ధర్మవరం 2.6, గాండ్లపెంట 2 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. రాగల రెండు రోజులూ జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. తాజా వర్షాలు ఖరీఫ్ పంటలకు కొంత ఊరటనిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.



జగరాజుపల్లిలో నిర్వహించిన వైద్య శిబిరానికి వచ్చిన స్థానికులు



శిబిరానికి వచ్చిన వారిని పరీక్షిస్తున్న వైద్యులు



మహిళకు నెలకు సరిపడా మందులను అందిస్తున్న డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి

సురక్షతో సూపర్ వైద్యం

- నిరుపేదల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- కలెక్టర్ అరుణ్‌బాబు వెల్లడి
- జగనన్న సురక్ష పైలెట్ ప్రోగ్రాం కింద జగరాజుపల్లిలో వైద్య శిబిరం
- 40 మంది వైద్య బృందంతో గ్రామస్తులకు వైద్య సేవలు



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, చిత్రంలో డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి

జగరాజుపల్లి సచివాలయం పరిధిలోని గ్రామాలు:	జగరాజుపల్లి, కప్పలబండ
సచివాలయం పరిధిలో కుటుంబాలు	1,018
జనాభా	2,999
బీపీ పరీక్ష చేయించుకున్న వారు	1,899
షుగర్ పరీక్ష చేయించుకున్న వారు	1,888
హెచ్‌బీ పరీక్ష చేయించుకున్న వారు	1,855
మూత్ర పరీక్ష చేయించుకున్న వారు	4
మలేరియా నిర్ధారణ పరీక్ష	ఒకరు
స్ఫుటం పరీక్ష చేయించుకున్న వారు	6
ఇతర వైద్య సేవలు పొందిన వారు	400

పుట్టపర్తి అర్బన్: 'జగనన్న ఆరోగ్య సురక్ష'తో నిరుపేదలకు ఇళ్ల వద్దే సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుతుందని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. వైద్య సిబ్బందే ఇంటింటికీ వెళ్లి పరీక్షలు నిర్వహిస్తారని, ఏదైనా జబ్బు ఉన్నట్లు గుర్తిస్తే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు పంపి మెరుగైన వైద్యం అందేలా చూస్తారన్నారు. 'జగనన్న ఆరోగ్య సురక్ష'కు పైలెట్ గ్రామంగా ఎంపికైన పుట్టపర్తి మండలం జగరాజుపల్లిలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది 40 మందికిపైగా పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. శిబిరాన్ని కలెక్టర్ అరుణ్‌బాబు, ఆర్డీఓ భాగ్యరేఖ, రాష్ట్ర కోఆర్డినేటర్, డిప్యూటీ డైరెక్టర్ శివశంకర్, డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్ తదితరులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీనరసమ్మ, సర్పంచ్ లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ..రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. ఈ క్రమంలోనే ప్రతి గ్రామంలోని పేదలకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించడానికి 'జగనన్న ఆరోగ్య సురక్ష'కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఇందులో భాగంగా 10 రోజుల నుంచి వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికీ తిరిగి ప్రాథమిక రక్త పరీక్షలు నిర్వహించారని, జబ్బులబారిన పడిన వారికి టోకెన్లు అందజేసి వైద్య శిబిరానికి తీసుకొచ్చి వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ప్రతి సచివాలయం పరిధిలోనూ 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలు నిర్వహిస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరంలో నలుగురు స్పెషలిస్ట్ వైద్యులు, టెక్నీషియన్లు, 40 మందికి పైగా వైద్య బృందం అందుబాటులో ఉంటుందన్నారు.

ప్రతి రోగికీ కేస్‌షీట్..

'జగనన్న ఆరోగ్య సురక్ష'లో భాగంగా వైద్యఆరోగ్య శాఖ అధికారులు ప్రతి రోగికీ ఒక కేస్‌షీట్ తయారు చేస్తున్నారు. అందులో ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రుల వివరాలు, రోగి రక్త నమూనాలు, జబ్బు వివరాలు, వారికి అందించిన మందులు, సూది మందు వివరాలు, తినే ఆహారం, తినకూడని ఆహారం, క్యాల్షియం, ఐరన్ మాత్రలు అందిస్తే వాటి వివరాలు... ఇలా ప్రతి ఒక్కటీ అందులో వివరంగా నమోదు చేస్తున్నారు. దీంతో సదరు వ్యక్తి ఎప్పుడు ఎక్కడికి వెళ్లినా ఈ కేస్‌షీట్ తీసుకువెళ్తే చాలు అక్కడి వైద్యుడి రోగి ప్రస్తుత పరిస్థితి సులభంగా అర్థమై వైద్యం అందించడం చాలా సులభమవుతుంది.

53 రకాల పరీక్షలు.. 150 రకాల మందులు

జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. మారిన ఆహారపు అలవాట్లు, ఒత్తిడితో కూడుకున్న విధులతో చాలా మంది జబ్బుల బారిన పడుతున్నారన్నారు. కొందరికి తాము అనారోగ్యం బారిన పడిన విషయం కూడా తెలియడం లేదన్నారు. పరిస్థితి విషమించినప్పుడు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారని, ఆ సమయంలో వైద్యులు కూడా ఏమీ చేయలేని పరిస్థితి ఉంటుందన్నారు. అందువల్లే రాష్ట్ర ప్రభుత్వం 'ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో భాగంగా వైద్య, ఆరోగ్య సిబ్బందిని ఇంటింటికీ పంపి పరీక్షలు చేయిస్తూ...వ్యాధుల బారిన పడిన వారిని గుర్తిస్తోందన్నారు. దీనివల్ల ఏదైనా జబ్బు ఉన్నట్లు తెలిస్తే ప్రాథమిక దశలోనే వైద్యం అందించి నయం చేయవచ్చన్నారు. 'జగనన్న ఆరోగ్య సురక్ష'లో 53 పరీక్షలు ఉచితంగా చేస్తారని, అవసరమైన వారికి 150 రకాల మందులను సైతం ఉచితంగా అందజేస్తారన్నారు. దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడిన వారికి నెలకు సరిపడా మందులు అందజేస్తారన్నారు. మెరుగైన వైద్యం అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల ద్వారా వైద్యం అందిస్తారన్నారు. ప్రభుత్వం ప్రస్తుతం ఆరోగ్యశ్రీ ద్వారా 3,200కుపైగా వ్యాధులకు ఉచిత వైద్యం అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శుభదాస్, డీపీఓ విజయ్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, ప్రజా ఆరోగ్య అధికారి వీరమ్మ, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, తహసీల్దార్ నవీన్‌కుమార్, ఈఓఆర్డీ అశోక్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ గంగాద్రి, నాయకులు మల్లిరెడ్డి, రమణారెడ్డి, సురేంద్రరెడ్డి తదితరులు ఉన్నారు.

మూడు రోజుల్లో కళ్లద్దాలిచ్చారు



వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది మూడు రోజుల క్రితం మా ఇంటి వద్దకే వచ్చి కంటి పరీక్షలు చేశారు. నేడు కళ్లద్దాలు ఇచ్చారు. ఇంత తక్కువ వ్యవధిలో కంటి అద్దాలు ఇవ్వడం చాలా సంతోషం ఉంది. గతంలో కంటి పరీక్షల కోసం అద్దాలకు ఎంతో ఖర్చు చేయాల్సి వచ్చేది. ప్రస్తుతం ఉచితంగానే అద్దాలు ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్ చల్లగా ఉండాలి. మా లాంటి ముసలోళ్లకు ఇంటికే వచ్చి ప్రతి నెలా పింఛన్ ఇస్తున్నారు. ఉచితంగా వైద్యం అందించి మందులు ఇస్తున్నారు.

– ఓబుళమ్మ, జగరాజుపల్లి

రక్త పరీక్ష చేసి మందులు ఇచ్చారు



నేను బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో రూ.లక్షలు ఖర్చు చేసి కిడ్నీ ఆపరేషన్ చేయించుకున్నా. థైరాయిడ్‌కూ మందులు వాడుతున్నా. అయినా ఇబ్బందిగా ఉండటంతో 'జగనన్న ఆరోగ్య సురక్ష'లో పరీక్ష చేయించుకున్నా. వైద్యులు మెరుగైన వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ కింద రెఫరల్ ఆస్పత్రికి పంపుతామన్నారు. ప్రస్తుతం ఉచితంగానే రక్త పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. చాలా ఆనందంగా ఉంది. ఇంత మంది వైద్యులు మావద్దకే రావడం ఎప్పుడూ చూడలేదు.

– లక్ష్మీదేవి, కప్పలబండ

సొంతబిడ్డలా చూసుకుంటున్నారు



గర్భం దాల్చినప్పటి నుంచి వైద్య ఆరోగ్య సిబ్బంది నన్ను సొంత బిడ్డలా చూసుకుంటున్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే వచ్చి మందులు, మాత్రలు ఇచ్చి తగిన సూచనలు ఇచ్చి పోతున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో క్యాల్షియం, విటమిన్ మాత్రలు ఇచ్చారు.

– సుకన్య, గర్భిణి, జగరాజుపల్లి

30లోపు ఈ–క్రాప్ పూర్తి చేయాలి



పొలంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు

పుట్టపర్తి అర్బన్: ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటలన్నీ 'ఈ–క్రాప్'లో నమోదు చేయాలని, ఈప్రక్రియ ఈనెల 30వ తేదీలోపు పూర్తికావాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. మంగళవారం ఆయన జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావుతో కలిసి పుట్టపర్తి మండలం బ్రాహ్మణపల్లి, బీడుపల్లి, జగరాజుపల్లి గ్రామాల్లో పర్యటించారు. 'ఈ–క్రాప్'లో వ్యవసాయ అధికారులు నమోదు చేసిన వివరాలను 'మాస్టర్ చెక్' చేశారు. నేరుగా పొలాల వద్దకే వెళ్లి రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రైతు సాగు చేసిన పంటలను వ్యవసాయాధికారులు, రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. బయోమెట్రిక్ ద్వారా దీన్ని ధ్రువీకరించాలన్నారు. పంటల వారీగా విస్తీర్ణం నమోదు చేయాలని, పొలంలోకి వెళ్లి జియో ఫెన్సింగ్ ద్వారా ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ–క్రాప్ తర్వాత రైతులతో ఈ–కేవైసీని సైతం పూర్తి చేయించాలన్నారు. రసీదులను మ్యాన్యువల్‌గా అందజేయాలన్నారు. అంతకుముందు కలెక్టర్ జగరాజుపల్లికి చెందిన రైతు గంగాద్రి మొక్కజొన్న పంట, బ్రాహ్మణపల్లిలో రైతు చంద్రశేఖర్‌రెడ్డి సాగుచేసిన వరిమడి, బీడుపల్లిలో రైతు వెంకటరమణ సాగు చేసిన మొక్కజొన్న పంటలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ భాగ్యరేఖ, తహసీల్దార్ నవీన్‌కుమార్, ఏఓ వెంకటబ్రహ్మం, సిబ్బంది ఉన్నారు.

అనంతలో ఫుట్‌బాల్ సందడి

- సబ్ జూనియర్ బాలుర జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం
- తొలిరోజు విజేతలు త్రిపుర, అసోం
- ఏపీ–సిక్కిం, తమిళనాడు–బిహార్ మ్యాచ్‌లు డ్రా



మ్యాచ్ తిలకిస్తున్న మాంఛో ఫెర్రర్, కలెక్టర్ గౌతమి, ఎంపీ కోటగిరి శ్రీధర్



ఆంధ్రప్రదేశ్- సిక్కిం జట్ల మధ్య మ్యాచ్


అనంతపురం: అనంతపురంలో ఫుట్‌బాల్ సందడి మొదలైంది. 15 రోజుల ఫుట్‌బాల్ క్రీడా పండుగకు ఆర్డీటీ క్రీడా గ్రామం వేదికైంది. సబ్ జూనియర్ బాలుర జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్–2023 పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 20 రాష్ట్రాల జట్ల క్రీడాకారులు తరలివచ్చారు. ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, కలెక్టర్ గౌతమి, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్ ముఖ్య అతిథులుగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని, పోటీలను ప్రారంభించారు. తొలిరోజు పోటీల్లో త్రిపుర, అసోం జట్లు గెలిచి శుభారంభం చేశాయి. ఏపీ–సిక్కిం, తమిళనాడు–బిహార్ జట్ల మధ్య మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. విద్యార్థులు, క్రీడాభిమానులు హాజరై ఫుట్‌బాల్ పోటీలను తిలకించారు.

మ్యాచ్‌ల వివరాలు..

- ఆంధ్రప్రదేశ్, సిక్కిం జట్ల మధ్య జరిగిన ఫుట్‌బాల్ మ్యాచ్ 1–1 గోల్‌తో డ్రాగా ముగిసింది. ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున సాత్విక్ గోల్ సాధించాడు.
- అండమాన్ నికోబార్ దీవుల జట్టుపై త్రిపుర జట్టు మూడు గోల్‌లు చేసి విజయం సాధించింది.
- హిమాచల్‌ప్రదేశ్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో ఏడు పాయింట్లతో అసోం జట్టు సాధించింది. హిమాచల్‌ప్రదేశ్ ఒక్క గోల్ కూడా సాధించలేక చతికిలపడింది.
- తమిళనాడు, బిహార్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 1–1 గోల్‌తో డ్రా అయ్యింది.

లేపాక్షి ఖ్యాతి ఎల్లలు దాటాలి

- 'యునెస్కో' శాశ్వత గుర్తింపు కోసం కృషి చేద్దాం
- జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగేశ్వరరెడ్డి
- ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా భారీ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

లేపాక్షి: పర్యాటక కేంద్రం లేపాక్షి ఖ్యాతి ఎల్లలు దాటేలా ప్రతి ఒక్కరం కృషి చేద్దామని జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం లేపాక్షిలో ప్రపంచ పర్యాటక దినోత్సవ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. తొలుత లేపాక్షిలోని గురుకుల పాఠశాల విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు నంది విగ్రహం నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం దేవాలయం ఆర్చ్ వద్ద మానవ హారంగా ఏర్పడి 'ఉంచుదాం..ఉంచుదాం.. లేపాక్షిని క్లీన్‌గా ఉంచుదాం', 'ప్లాస్టిక్‌ను నిషేధించాలి', 'రావాలి..రావాలి.. యునెస్కో గుర్తింపు రావాలి'అంటూ నినాదాలు చేశారు. అదేవిధంగా పర్యాటక కేంద్రమైన లేపాక్షిలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ అధికారి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ... ఏటా సెప్టెంబరు 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని లేపాక్షిలో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే ముందుస్తు ర్యాలీని నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. లేపాక్షికి యునెస్కో శాశ్వత గుర్తింపు రావడానికి ప్రజల భాగస్వామ్యంతోనే అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

లేపాక్షికి జాతీయ అవార్డు..

ఉత్తమ పర్యాటక కేంద్రంగా లేపాక్షిని ఎంపిక చేసిందని నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఏటా ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా కేంద్రం అవార్డులు ఇస్తుందని, ఈసారి 31 రాష్ట్రాల నుంచి 795 దరఖాస్తులు అందగా, అధికారులు లేపాక్షిని ఎంపిక చేసారన్నారు. భారత ప్రభుత్వ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో బుధవారం న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమంలో లేపాక్షి సర్పంచ్ ఆదినారాయణ అవార్డు అందుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబు, ఎంపీడీఓ నరసింహనాయుడు, స్థానిక టూరిజం మేనేజర్ లక్ష్మణరావు, ఏఎస్ఐ షర్ఫుద్దీన్, గ్రామ సర్పంచ్ ఆదినారాయణ, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఆదినారాయణ, అశ్వత్థప్ప, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, కోఆప్షన్ సభ్యులు బషీర్, స్థానిక నాయకులు చలపతి, అంజినరెడ్డి, నిస్సార్ తదితరులు పాల్గొన్నారు.



మానవహారంగా ఏర్పడిన అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

రోగులతో టీడీపీ నాయకుల చెలగాటం

- మాజీ మంత్రి పరిటాల సునీత అడ్మిషన్‌తో హంగామా

అనంతపురం మెడికల్: టీడీపీ నాయకుల హంగామా రోగులకు ఇబ్బంది కలిగించింది. అత్యవసర వైద్యం కోసం అంబులెన్సుల్లో తీసుకొచ్చిన రోగులను క్యాజువాలిటీలోకి తీసుకెళ్లేందుకు దారి లేకుండా అడ్డుగా నిల్చున్నారు. తెలుగుదేశం అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ అనంతపురంలో మాజీ మంత్రి పరిటాల సునీత చేపట్టిన ఆమరణ దీక్షను పోలీసులు భగ్నం చేశారు. అనంతరం ఆమెను చికిత్స నిమిత్తం సర్వజనాస్పత్రి క్యాజువాలిటీలో చేర్చారు. ఇదే క్రమంలో మాజీ మంత్రులు కాలవ శ్రీనివాసులు, పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి, టీడీపీ నేత పరిటాల శ్రీరామ్‌తో పాటు కార్యకర్తలు ఆస్పత్రిలోకి చొరబడ్డారు. కార్లు, ద్విచక్ర వాహనాలను ఇష్టారాజ్యంగా పార్క్ చేశారు. దీంతో 108 అంబులెన్స్‌లు లోపలికి వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. అంబులెన్స్‌లో వచ్చిన రోగులను అతికష్టం మీద క్యాజువాలిటీకి తరలించారు. ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు టీడీపీ కార్యకర్తలు ఆస్పత్రి ఆవరణలో నినాదాలు చేస్తూ భయానక వాతావరణం సృష్టించారు. చివరకు మాజీ మంత్రి పరిటాల సునీత డిశ్చార్జ్ అయ్యాక వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

కేబుల్ చోరీ చేస్తూ పట్టుబడిన విద్యార్థులు

ఎన్పీకుంట: మండలంలోని జౌకల గ్రామానికి చెందిన రైతులు అప్పిరెడ్డి, వెంకట్రామిరెడ్డి పొలాల వద్ద విద్యుత్ మోటార్‌కు అమర్చిన కేబుల్ చోరీ చేస్తూ ఇద్దరు విద్యార్థులు పట్టుబడ్డారు. మంగళవారం ఉదయం అటుగా వచ్చిన విద్యార్థులు విద్యుత్ కొక్కీలను తొలగించి కేబుల్‌ను కత్తిరించుకుని పారిపోతుండగా గ్రామస్తులు వెంబడించి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన విద్యార్థులు అన్నమయ్య జిల్లా కల్లూరుపల్లికి చెందిన అన్నదమ్ములుగా పోలీసులు గుర్తించారు. ఎన్పీ కుంటలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఒకరు పదో తరగతి, ఇంకొకరు తొమ్మిది తరగతి చదువుతున్నారు. విషయం తెలుసుకున్న జౌకల, మరికొమ్మదిన్నె, మండెంవారిపల్లి, ఎన్పీ.కుంట గ్రామాలకు చెందిన పలువురు రైతులు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని మూడు నెలలుగా తమ పొలాల్లోని దాదాపు 5వేల మీటర్లకు పైగా కేబుల్ అపహరణకు గురైందని ఫిర్యాదు చేశారు. విచారణలో అపహరించిన కేబుల్‌ను గాలివీడులోని ఓ గుజరీ దుకాణంలో విక్రయించినట్లు విద్యార్థులు అంగీకరించారు. విషయం తెలుసుకున్న స్థానిక వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొత్త రంగారెడ్డి, ఆర్బీకే చైర్మన్ ఆదినారాయణరెడ్డి, నాయకుడు తిరుమలనాయుడు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేసు నమోదు కాకుండా కౌన్సెలింగ్‌తో సరిపెట్టాలని, అయితే వీరి వెనుక ఉన్న అసలు సూత్రధారిని గుర్తించి బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

ముదిగుబ్బ: తండ్రిని హతమార్చిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సీఐ యత్రీంద్ర మంగళవారం వెల్లడించారు. ముదిగుబ్బ మండలం అడవి బ్రాహ్మణపల్లికి చెందిన భీమానాయక్ రోజూ మద్యం తాగి భార్యను వేధిస్తుండేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి మద్యం మత్తులో భార్యతో గొడవ పడడంతో కుమారుడు విజయ్‌కుమార్ నాయక్ కల్పించుకుని తండ్రిని మందలించాడు. ఆ సమయంలో మాటామాట పెరగడంతో కుమార్‌నాయక్ దాడిలో భీమానాయక్ మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో మంగళవారం కుమార్‌నాయక్‌ను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

యువతి అదృశ్యం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని రాజీవ్‌కాలనీకి చెందిన టి.శ్రీనివాసులు కుమార్తె రమ్యశ్రీ అదృశ్యమైనట్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య తెలిపారు. సోమవారం సాయంత్రం వజ్రకరూరులో ఉన్న తన స్నేహితురాలి ఇంటికి వెళ్లొస్తానని బయల్దేరిన ఆమె రాత్రయినా ఇంటికి చేరలేదు. దీంతో మంగళవారం యువతి తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పర్యాటకం.. ఆహ్లాదకరం

- చరిత్రకు సాక్షిగా నిలిచిన జిల్లాలోని పర్యాటక ప్రదేశాలు
- నేడు సాయి ఆరామంలో టూరిజం వేడుకలు


లేపాక్షిలో వెలసిన ఏడుపడగల నాగేంద్రుడు

పుట్టపర్తి టౌన్: జిల్లాలో పర్యాటక ప్రాంతాలు దేశ విదేశీ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఓ వైపు ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతూనే... మరో వైపు చరిత్రకు సాక్షిగా నిలిచిన అరుదైన కట్టడాలు, ప్రకృతి రమణీయతకు అద్దం పట్టే ఎన్నో దృశ్యాలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిమ్మమ్మ మర్రిమాను, సుందర లేపాక్షి, పెనుకొండలో విజయనగరం కోట, దర్గా, కటారుపల్లిలో యోగి వేమన సమాధి, బత్రేపల్లి జలపాతం, మడకశిర కోట, పెనుకొండ కుంభకర్ణ, ననసకోట ముత్యాలమ్మ ఆలయం, ప్రపంచ ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతున్న పుట్టపర్తిని సందర్శించేందుకు దేశవిదేశాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పర్యాటక క్షేత్రాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

ప్రపంచ ఆధ్యాత్మిక ధామం..

జిల్లా కేంద్రం పుట్టపర్తిని సందర్శించే ఎవరైనా ఆధ్యాత్మియ చింతనలో ఓలలాడాల్సిందే. అద్భుతమై నిర్మాణాలు, హాయిగొలుపే వాతావరణం, అడుగడుగునా సాయి నామ స్మరణం కొత్త అనుభూతినిస్తుంది. ఇక్కడి చైతన్యజ్యోతి మ్యూజియం, నక్షత్రశాల, హిల్ వ్యూ స్టేడియం, డీమ్డ్ యూనివర్సిటీ, పంచముఖ ఆంజనేయస్వామి, ప్రశాంతి నిలయం, చిత్రావతి నది వంటివి ప్రత్యేకంగా పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి.

అతి పెద్దదైన మరిమాను..

దక్షిణ భారతదేశంలోనే అతి పెద్దదైన మర్రిమాను కదిరికి 28 మైళ్ల దూరంలో ఎన్పీకుంట మండలం గూటిబైలులో ఉంది. సుమారు 8.75ఎకరాల్లో విస్తరించి 6.689 ఊడలతో ఉన్న ఈ మర్రిమానును తిమ్మమ్మ మర్రిమానుగా పిలుస్తుంటారు. 1989 లోనే ఈ మహా వృక్షం గిన్నీస్ బుక్‌లో చోటు దక్కించుకుంది. కదిరిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కటారుపల్లిలోని యోగివేమన సమాధి కూడా పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి.


కదిరి ప్రాంతంలో విస్తరించిన తిమ్మమ్మ మర్రిమాను


పెనుకొండ కోట ముఖద్వారం

సందర్భం: నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

ఆహ్లాదాన్ని పంచే నంది కొండలు..

జిల్లాకు అత్యంత చేరువలో నంది కొండలు పర్యాటకలకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. నంది కొండ నుంచి కిందకు చూస్తే మేఘాల పైనుంచి చూస్తున్నట్లుగా ఉంటుంది.

వారసత్వ కట్టడం..

హిందూపురానికి 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న లేపాక్షి దేశ వారసత్వ సంపదకు నిలయంగా మారింది. ఇక్కడి వీరభద్రస్వామి ఆలయానికి ప్రపంచ వారసత్వ కట్టడాల్లో తాత్కాలిక చోటు దక్కింది. ఆలయంలో కట్టడాలు అద్భుతంగా ఉన్నాయి. వేలాడే స్తంభం, ఏడుపడగల నాగేంద్రుడు, వట పత్ర సాయి చిత్రం ప్రధానంగా పర్యాటకులను మంత్రముగ్దులను చేస్తున్నాయి. నందీశ్వరుని ఏక శిలా విగ్రహం దేశంలోనే అతిపెద్దది.

విజయనగర రాజుల కొండ..

విజయనగర రాజుల వైభవాన్ని చాటి చెప్పే పెనుకొండ కోట పర్యాటకులను అబ్బుర పరుస్తోంది. కొండపై ఉన్న లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, గగన్‌మహల్, బాబయ్య దర్గా, కుంభకర్ణ విగ్రహం, తిమ్మరుసు బందీఖానా, పార్శ్వనాథుని ఆలయం ఇక్కడి సందర్శనీయ స్థలాలు.

సాయి ఆరామంలో నేడు పర్యాటక దినోత్సవం..

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని పుట్టపర్తిలోని సాయిఆరామంలో వేడకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగేశ్వరరెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముందుగా సత్యమ్మ కూడలి నుంచి సాయి ఆరామం వరకూ విద్యార్థులతో ర్యాలీ ఉంటుంది. అనంతరం పర్యాటక రంగంపై సాయి ఆరామంలో విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేయనున్నారు. కలెక్టర్ అరుణ్‌బాబుతో పాటు జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు హాజరు కానున్నారు.

5, 6 తేదీల్లో జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

అనంతపురం సిటీ: ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు వచ్చే నెల 5, 6 తేదీల్లో నిర్వహించాలని జెడ్పీ పాలకవర్గం, అధికారులు నిర్ణయించారు. 5న స్థాయీ సంఘం-1, 3, 7 (ఆర్థిక, ప్రణాళిక/వ్యవసాయం/ఇంజినీరింగ్ శాఖలు) సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఇన్‌చార్జ్ సీఈఓ/జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. 6న స్థాయీ సంఘం-2, 4, 5, 5 (గ్రామీణాభివృద్ధి/ విద్య, వైద్యం/ స్త్రీ, శిశు సంక్షేమం/ సాంఘిక సంక్షేమ శాఖలు) సమావేశాలు డిప్యూటీ సీఈఓ లలితాబాయి ఆధ్వర్యంలో ఆయా స్థాయీ సంఘం అధ్యక్షుల అధ్యక్షతన నిర్వహించనున్నారు. గత సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన అంశాలు, వాటిపై తీసుకున్న చర్యల గురించి అధికారులు సమగ్ర సమాచారంతో సమావేశాలకు హాజరు కావాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

ముళ్లకంపపై నిద్రించిన పూజారి

బెళుగుప్ప: మండలంలోని బెళుగుప్ప తండాలో మంగళవారం జరిగిన గౌరసంద్రం మారెమ్మ జాతరలో భారీగా పేర్చిన ముళ్ల కంపలపై ఆలయ పూజారి చంద్రానాయక్ నడుచుకుంటూ వెళ్లి నిద్రించాడు. జాతరలో భాగంగా ఉదయం అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగించారు. అనంతరం ఆచారంలో భాగంగా ముళ్లకంపలపై పూజారి నిద్రించే కార్యక్రమం కొనసాగింది. ఈ వింత సంప్రదాయాన్ని చూసేందుకు ఉరవకొండ, బెళుగుప్ప, కళ్యాణదుర్గం ప్రాంతాల నుంచి భారీగా ప్రజలు ఆలయం వద్దకు చేరుకున్నారు.


ముళ్ల కంపలపై నిద్రిస్తున్న చంద్రానాయక్

అంగన్‌వాడీ భవనం మాయం

- ప్రభుత్వ భవనాన్ని కూల్చివేసిన అంగన్‌వాడీ కార్యకర్త
- టీడీపీ నాయకుల అండతోనే కూల్చారంటున్న గ్రామస్తులు


అంగన్‌వాడీ కేంద్రాన్ని కూల్చివేస్తున్న దృశ్యం


శిథిలాలను తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్

పుట్టపర్తి అర్బన్: దాదాపు మూడు దశాబ్దాలకు పైగా విశిష్ట సేవలు అందించిన అంగన్ వాడీ కేంద్రాన్ని గుట్టు చప్పుడు కాకుండా మాయం చేసిన ఘటన పుట్టపర్తి మండలం బత్తలపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఐసీడీఎస్ అధికారులు తెలిపిన మేరకు.. బత్తలపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్తగా 32 ఏళ్లుగా చెన్నక్రిష్ణమ్మ పనిచేస్తోంది. 1996లో అప్పటి టీడీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రానికి భవనాన్ని నిర్మించాలని సంకల్పించడంతో చెన్నక్రిష్ణమ్మ తండ్రి చిన్నప్ప రోడ్డు పక్కన ఉన్న సర్వే నెంబర్ 224లోని తన సొంత స్థలం 4 సెంట్లు విరాళంగా అందజేశాడు. పక్కా భవనంతో పాటు ప్రహరీ నిర్మాణానికి దాదాపు రూ.10 లక్షలను అప్పటి ప్రభుత్వం వెచ్చించింది. అప్పటి నుంచి అంగన్‌వాడీ కార్యకర్తగా అదే భవనంలో చెన్నక్రిష్ణమ్మ పనిచేస్తూ వస్తోంది.

స్థలానికి విలువ పెరిగిందని..

అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనానికి రూ.10 లక్షలు వెచ్చించిన అప్పటి టీడీపీ ప్రభుత్వం తర్వాత 1999లో మరో రూ.1 లక్ష ఖర్చుతో సంప్, ట్యాంక్, పైప్‌లైన్ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం గ్రామ సమీపంలో నాలుగు లైన్ల జాతీయ రహదారి నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో ఆ ప్రాంతంలో భూముల ధరకు రెక్కలు వచ్చాయి. విషయాన్ని తెలుసుకున్న చెన్నక్రిష్ణమ్మ స్థానిక టీడీపీ నాయకులతో కలసి అంగన్‌వాడీ భవనాన్ని కూల్చి వేసి ఆ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు పథకం రచించింది. ఇందులో భాగంగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాల్లోకి వెళ్లి సదరు స్థలానికి సంబంధించి ఏమైనా అగ్రిమెంట్లు ఉన్నాయోనని గాలించింది. ఎక్కడా ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గంటల వ్యవధిలోనే భవనాన్ని కూల్చి వేసి శిథిలాలను మాయం చేసింది.

అధికారుల అనుమతితోనే కూల్చామంటూ..

జేసీబీని ఏర్పాటు చేసి అంగన్‌వాడీ భవనాన్ని కూలిచ్చేస్తున్నారని తెలుసుకున్న గ్రామస్తులు పలువురు అక్కడకు చేరుకుని కార్యకర్త చెన్నక్రిష్ణమ్మను నిలదీశారు. అయితే అధికారుల అనుమతితోనే ఆ భవనాన్ని కూల్చి వేస్తున్నట్లు బుకాయించిన ఆమె గ్రామస్తులను పల్లెత్తు మాట మాట్లాడకుండా కట్టడి చేసింది.

పరిశీలిస్తాం..

అంగన్‌వాడీ భవనం కూల్చివేతపై ఐసీడీఎస్ అధికారులను మంగళవారం మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు నిలదీశారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సీడీపీఓ గాయత్రి అవాక్కయ్యారు. భవనం కూల్చివేత అంశం తమకేమీ తెలియదన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త చెన్నక్రిష్ణమ్మ కుమారుడు లోకనాథ్ ఓ సారి కార్యాలయానికి వచ్చి గ్రామంలో అంగన్ వాడీ కేంద్రానికి కొత్త భవనం ఉందని, కేంద్రాన్ని అందులోనే నడుపుతున్నట్లు ఆ సమయంలో లోకనాథ్ పేర్కొన్నాడన్నారు. పాత భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో దాని కూల్చివేసుందుకు అనుమతివ్వాలని కోరాడని వివరించారు. అయితే ఈ విషయాన్ని ఉన్నతాధికారులతో చర్చించాలని ఆ సమయంలో తాను చెప్పినట్లు గుర్తు చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి వాస్తవాలు నిగ్గు తెల్చి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మూడిళ్లలో చోరీ

కదిరి టౌన్: స్థానిక మున్సిపల్ పరిధిలోని అడపాలవీధి సమీపంలోని పంచాయతీరాజ్ కార్యాలయం వద్ద పక్కపక్కనే ఉన్న మూడు ఇళ్లలో సోమవారం రాత్రి దుండగులు చొరబడి విలువైన సామగ్రి అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... పీఆర్ కార్యాలయం సమీపంలోని లైట్ హౌస్ వద్ద గుణశేఖరరెడ్డి, చంద్రశేఖర్, పార్నపల్లి ప్రసాద్ కుటుంబాలు నివాసముంటున్నాయి. ఈ క్రమంలో జమ్మల మడుగులోని బంధువుల ఇంటికి ప్రసాద్ వెళ్లాడు. గుణశేఖరరెడ్డి దంపతులు కూడా శిరిడీ క్షేత్ర దర్శనకు గురువారం బయలుదేరి వెళ్లారు. చంద్రశేఖర్ సైతం పనిపై ఇంటి తాళం వేసి పులివెందులలోని బంధువుల ఇంటికి వెళ్లారు. మూడు ఇళ్లకు తాళాలు వేసి ఉండడం గమనించిన దుండగులు సోమవారం రాత్రి తలుపులు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. ప్రసాద్ ఇంట్లో 30 తులాల బంగారు నగలు, రూ.2 లక్షలు, చంద్రశేఖర్ ఇంట్లో 3 తులాల బంగారు, రూ.35 వేలు నగదు, గుణశేఖర్‌రెడ్డి ఇంట్లో 10 తులాల బంగార నగలు, ద్విచక్ర వాహనం అపహరించుకెళ్లారు. ప్రసాద్, చంద్రశేఖర్ మంగళవారం మధ్యాహ్నం 1 గంటకు ఇళ్లకు చేరుకోవడంతో చోరీ విషయం వెలుగు చూసింది. సమాచారం అందుకున్న డీఎస్పీ శ్రీలత, సిబ్బంది అక్కడకు చేరుకుని సీసీ ఫుటేజీలు పరిశీలించారు. స్నిప్పర్ డాగ్‌ను రంగంలో దించారు. క్యూస్ టీం ద్వారా నిందితుల వేలిముద్రలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం


ప్రమాదంలో నుజ్జునుజ్జైన కారు


మృతదేహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

పావగడ: లారీ ఢీకొన్న ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు దుర్మరణం పాలయ్యారు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు... పావగడ తాలూకా గుజ్జనడు గ్రామానికి చెందిన ఆకాష్ (23), కార్తీక్(23), హేమంత్(27), ఉజ్వల్ బెంగళూరులో వివిధ వృత్తుల్లో స్థిరపడి, జీవనం సాగిస్తున్నారు. మంగళవారం గుజ్జనడులో జరిగే మారెమ్మ జాతరలో పాల్గొనేందుకు నలుగురూ ఓ కారులో సోమవారం రాత్రి పది గంటలకు బెంగళూరు నుంచి బయలుదేరారు. పావగడకు 30 కిలోమీటర్ల దూరంలో మిడిగేశి సమీపంలోకి చేరుకోగానే వేంకటేశ్వర కల్యాణమంటపం వద్ద మలుపులో ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొంది. ఘటనలో కారు నుజ్జునుజ్జైంది. ఆకాష్, కార్తీక్, హేమంత్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఉజ్వల్‌ను అటుగా వెళుతున్న వారు కాపాడి తుమకూరు ఆస్పత్రిలో చేర్పించారు. సమాచారం అందుకున్న మిడిగేశి పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, ముగ్గురు యువకుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మార్చురీలో ఉన్న మృతదేహాలను చూసి తల్లిదండ్రులు రోదించిన తీరు చూపరులను కంట తడి పెట్టించింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే వెంకటేష్ మధుగిరి ఆస్పత్రికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. ఘటనపై ఆరా తీసి, బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు.

తాడిపత్రిలో చైన్‌స్నాచింగ్


ఘటన జరిగిన తీరు వివరిస్తున్న బాధితురాలు కృష్ణవేణి

తాడిపత్రి: రూరల్ పరిధిలోని గన్నెవారిపల్లి కాలనీలో నివాసముంటున్న కృష్ణవేణి మెడలోని బంగారు గొలుసును దుండగులు అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... మంగళవారం తెల్లవారుజామున తన ఇంటి వద్ద ఉన్న పశువుల పాక వద్ద చెత్తను కృష్ణవేణి శుభ్రం చేస్తుండగా ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై అక్కడకు చేరుకున్నారు. వీరిలో ఒకరు కిందకు దిగి కృష్ణవేణి మెడలోని 3 తులాల బంగారు గొలుసును లాక్కొని ద్విచక్ర వాహనంపై ఉడాయించాడు. మంకీక్యాప్ ధరించడం వల్ల వారు ఎవరైంది తెలియకుండా పోయింది. కృష్ణవేణి కేకలతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకునే లోపు దుండగులు కంటికి కనిపించకుండా పోయారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు తాడిపత్రి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటన జరిగిన ప్రదేశంలోని ఓ ఇంటి వద్ద ఉన్న సీసీకెమెరాల పుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

నిత్యావసరాలు సక్రమంగా పంపిణీ చేయండి

కొత్తచెరువు: చౌకధాన్య డిపోల ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని డీలర్లకు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డి ఆదేశించారు. నిత్యావసర సరుకుల పంపిణీపై మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో ఆయన సమీక్షించారు. ప్రతి నెలా బియ్యం, రాగులు, గోధుమ పిండి, కందిబేడలు తదితర నిత్యావసరాల పంపిణీ తీరును అడిగి తెలుసుకున్నారు. బయోమెట్రిక్ పనితీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ స్వాతి, డీలర్లు పాల్గొన్నారు.

ప్రమాదంలో ఒకరి మృతి

పావగడ: అరసికెర పోలీస్ స్టేషన్ పరిధిలోని మంగళవాడ గ్రామ పెట్రోల్ బంక్ వద్ద మంగళవారం రాత్రి 8 గంటలకు చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... చిక్కతిమ్మనహట్టి గ్రామానికి చెందిన దర్శన్(28) కెరెక్యాతనహళ్లి నుంచి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా మంగళవాడ పెట్రోల్ బంక్ వద్ద ద్విచక్ర వాహనంలో వస్తున్న కోటబండె గ్రామం నుంచి ఈశ్వరప్ప, తూముకుంటె నాగరాజప్ప ఢీకొన్నారు. ఘటనలో దర్శన్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. తీవ్ర గాయాలైన ఈశ్వరప్ప, నాగరాజప్పను స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై అరసికెరె పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రైతులకు అందుబాటులో ఉండండి

పెనుకొండ: రైతులకు అందుబాటులో ఉంటూ 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బిందు, తుంపర సేద్యం పరికరాలను అమర్చే పనులు వేగవంతం చేయాలని మైక్రో ఇరిగేషన్, కంపెనీల సిబ్బందిని ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ ఆదేశించారు. స్థానిక ఉద్యాన శాఖ కార్యాలయంలో జిల్లా ఉద్యానాధికారి చంద్రశేఖర్‌తో కలసి డ్రిప్ పరికరాల ఏర్పాటు అంశంపై మంగళవారం ఆయన సమీక్షించారు. ఏ దశలోనూ పనులు పెండింగ్‌లో ఉంచరాదన్నారు.